జోసెఫ్ మార్టిన్ బార్
(ఆంగ్లానువాదం: ఆర్. టి. కె. సైమింగ్టన్)

# 2. వెచ్చదనం కోసం అన్వేషణ

తన బుద్ధిసూక్ష్మతనంతా ఉపయోగించి—ఆ సూక్ష్మత పూర్తిగా తన సొంతమని అతని నమ్మకం—సైమన్ స్కెనెల్లర్, అతి త్వరలో ఒక విషయం కనిపెట్టాడు. సచివాలయం లోపల వెచ్చగా వుంటుంది. అతిథిగా వెళ్లి, కానీ ఖర్చులేకుండా వెచ్చదనం అనుభవించవచ్చు. ఇతర హక్కులేవీ అతనికి లేకపోవచ్చు. అతడు, ఏవో ప్లానులు, దరఖాస్తులు, సవరణ పత్రాలు మార్పులు-చేర్పులు పట్టుకుని అధికారుల్ని ఆశ్రయించడానికే ఆ భవనంలో అడుగుపెట్టినా, వెచ్చదనం మాత్రం అనుభవించవచ్చు. ఒక గృహనిర్మాణ సంస్థ తరుపున, ప్లానులు, దరఖాస్తులు, సవరణపత్రాలు పట్టుకుని, ఆ భవనంలో ప్రవేశించినప్పుడు ఈ పరమసత్యం కనిపెట్టాడు. సచివాలయంలో పని అతి తాపీగా నడుస్తుంది, అసలు అధికారుల దర్శనం దొరకాలంటే ఏంతోసేపు వేచి వుండాలి. పై కారణాలు చెప్పుకుని, అతను అవధికి మించి అక్కడే కాలక్షేపంచేస్తూ, తన్నుతాను సమర్థించుకున్నాడు. అటువంటి అవకాశం దొరికినప్పుడు, చలికాలపు పగళ్ళు చాలాభాగం, ఆ సచివాలయపు వెచ్చని వరండాలలోనూ, గదుల్లోనూ గడిపేస్తుంటాడు. కొద్ది మాసాలు ఇలా గడపడం ద్వారా, సచివాలయాన్ని గురించిన వివరాలు—అంతకంతకు అతి స్పష్టంగా అతను గ్రహించగలిగాడు. ఏ గది ఎవరిది, ఈ సచివాలయంలో ఎన్ని విభాగాలున్నాయి, ఏ విభాగాన్ని ఏ వ్యక్తి చూస్తున్నాడు, మొదలైనవి. అంచేత, తను ఆ సచివాలయంలో ఏ విధమైన నౌకరీ చెయ్యకపోయినా, దరఖాస్తుదారులికీ,

వనులమీద వచ్చినవారికీ—తడుముకోకుండా—వారు వెళ్ళవలసిన గది సంఖ్య, ఆ గదిలో కూర్చున్న ఉద్యోగి పేరు, అతన్ని గురించిన ఇతర వివరాలు-ఆకార వికారాలు, ప్రత్యేకలక్షణాలు, గుణగణాలు, తిక్కలు అన్నీ అతి స్పష్టంగా వివరించగలడు. నిష్పాక్షికంగా చెప్పాలంటే, సైమన్ సేకరించిన విజ్ఞానం అతి క్లిష్టమైనదే. ఎందుకంటే, ఆ భవనంలో ఎనిమిది అంతస్థులున్నాయి. మంత్రిత్వశాఖ లోని కొన్ని విభాగాలు అతి ప్రాచీనమైనవి. అదీగాక, ఆ భవనంలో కొన్ని దార్లూ, వరండాలూ, పద్మవ్యూహంలా గజిబిజిగా వుంటాయి. అయితే సైమన్ ఈ విజ్ఞానమంతా ఎలా సేకరించాడంటే—తను సమర్పించవలసిన దరఖాస్తు, అధికారికి అందజేసేముందు, ఆ పొడుగుపాటి వరండాలలోనూ, అంతులేని విశ్రామ స్థలాల్లోనూ ఎంతోసేపు తిరిగేవాడు, వెచ్చదనం తృప్తిగా అనుభవించడానికి. ఆ దరఖాస్తు అందజేసిన తరువాత ఒక గదిలోంచి మరో గదిలోకి అతి తీరికగా తిరిగేవాడు. తిరుగుతూ పరీక్షగా అన్నీ చూసేవాడు, తీరికగా ఎంతసేపు వీలైతే అంతసేపూ అక్కడ గడపడమే అతని ఆశయం పరీక్షగా చూడ్డం ఎందుకంటే, గదుల్లోనూ వరండాలలోనూ, వేడి గాలివచ్చే గొట్టా లెక్కడెక్కడ అమర్చారో గుర్తుపెట్టుకోడానికి, అతను సేకరించిన ఇతర వివరాల్లో ప్రతి ఒక్కటీ గదులమీది అంకెలు, పేర్లు, మంత్రిత్వశాఖలు, తలుపుల వెనక వున్న ప్రత్యేకాధికారులు, వారిశ్రేణి—ఒకొక్క వేడి గాలిగొట్టానికి అనుబంధించి వుంటుంది. సైమన్ ఆదాయం తక్కువ కావడం చేత, సొంతంగా చుట్టుకున్న సిగరెట్టయినా మళ్ళీ అంటించాలంటే, ఇరవై వేడి గాలిగొట్టాలు దాటేటంత వ్యవధి వుండాలి. అలాగైతేనే అతని ఆదాయవ్యయాలు సరిపెట్టుకోవచ్చు.

ఒకొక్కప్పుడు సోమరితనం అతిస్పష్టంగా అతని ముఖంమీద వ్రాసి వుంటుంది. అతని హావభావాలకు పొత్తుకలవదు. అటువంటప్పుడు, ఏ ఇన్స్పెక్టరో—ఆడవాళ్ళు ఏ వయసువాళ్ళయినా అతనికేసి అసలు చూడరనుకోండి—ఏ గుమాస్తావో, ఏం పనిమీదవచ్చావని అడుగుతారు. ఆ అడగడంలో—ఈ భవనంలో ప్రతి ఒక్కరూ పనిలో మునిగితేలాలనీ, విశ్రాంతిగా సిగరెట్లు త్రాగేవారి కిక్కడ ప్రవేశం లేదనీ స్పష్టంగా సూచిస్తారు. అయితే అంతులేని విశ్రాంతివల్ల సైమన్‌కి, తన నరాలను పూర్తిగా అదుపాజ్ఞల్లో పెట్టగల శక్తి అలవడింది. అటువంటి సమయాల్లో అతను ఒకమూసిఉన్న తలుపువంక వేలుపెట్టి చూపిస్తాడు—ఆ తలుపు

వెనుక ఉద్యోగిని చూడ్డంకోసం వచ్చినట్టు మూగభాషలో సూచిస్తాడు. ఈ సంద ర్భాలను గురించి బాగా తర్జనభర్జన చెయ్యగా అతనికొకటి తోచింది—ఒక ఆఫీసు తలుపువేపు వేలుపెట్టిచూపించడానికి ప్రాతిపదికగా, చంకలో ఒక కాగితాలసంచీ వుంటే బాగుంటుందని. తదనంతరం, వివరాలన్నీ సాకల్యంగా యోచించుకుని, ఈ వెచ్చదనం అనుభవించే ప్రణాళికలో, అబద్ధపు కాగితాలసంచీ ఒక పరికరంగా చేర్చుకున్న తరువాత, అతని జీవితంలో ఒక అపురూపమైన మార్పువచ్చింది.

అయితే, ప్రతిరోజూ అతను సచివాలయానికి వెళ్ళవలసిన అగత్యంగానీ, అవసరంగానీ కలగదు. అంచేత, పనిలేనిరోజుల్లో ఆ భవనంలో ప్రవేశించడానికి, ఎంతో శ్రమపడి అదనపు సరంజామ సమకూర్చుకోవలసి వచ్చేది. పాత దిన పత్రిక, డైరీ, కాలండరు, అవసరం తీరిపోయిన బిల్లులు ఒక డజను, కష్టపడి సేకరించి, అత్యంతోపయోగకరమైన ఈ ఆయుధాలను సంచీలో దట్టించి, సచివా లయపు వరండాలలో జరగబోయే అబద్ధపు యుద్ధానికి సిద్ధపడేవాడు. క్రమక్రమంగా రోజూ పనిమీదవచ్చే మనిషిగానో, ఉద్యోగరీత్యానో, శాశ్వతంగా ఆ భవనానికి చెందిన వ్యక్తిగా చలామణీ అయిపోయాడు. ఈ పరిణామం వచ్చిన తరువాత, అతనికింక ఏవిధమైన ఇబ్బందీ లేకండా, చలికాలంలో వెచ్చదనం అనుభ వించడానికి అనుకూలత నిశ్చయమై పోయింది. ఆఫీసు ఫైళ్ళు పట్టుకుని హడావిడిగా పోయే శ్రీమతులూ, కుమారీమణులూ అతని అస్థిత్వాన్ని చూపుల ద్వారా అంగీకరించారు. ఒకొక్కప్పుడు ఒకొక్క పెద్దమనిషి, ఇతడు సాటి ఉద్యోగో, ఆగంతకుడో తేల్చుకోలేక కాస్త ముభావంగా పలకరించేవాడు. తరచుగా అతను మంత్రిగారు వస్తుంటే, అతి ఉత్సాహంగా తలుపులు తెరిచి, ఆయన ధన్య వాదాలు కూడా సంపాదించేవాడు. అయితే ఈ వెచ్చదనపు అన్వేషణతో సంబంధం లేకండా, సైమన్ సచివాలయపు భవనంలో వరండాలూ గదులూ తిరగవలసిన సందర్భం ఒకటి వచ్చింది. ఒకనాడు మధ్యాహ్నం ఒంటిఅద్దం కళ్ళజోడు పెట్టుకున్న పెద్దమనిషి ఒకడు — అతని పేరు కోల్ అనీ, అతను మంత్రిత్వ శాఖలో గౌరవోద్యోగి అనీ సైమన్‌కి చాలకాలంగా తెలుసు—సైమన్‌ని ఆప్యా యంగా సాటి ఉద్యోగిగా పలకరించాడు. ఆ పలకరించడంలో తనకన్న కింది ఉద్యోగితో మాట్లాడుతున్న సూచన గొంతుకలో స్పష్టంగా ధ్వనించింది. ఆఅధికారి అతని చేతిలో ఒక జాబితా పెట్టి, ఆ శాఖలోని జీతగాళ్ళందరి దగ్గరకూ పోయి,

అకాలమరణానికి గురియయిన సహోద్యోగి సోల్‌మన్ విషయంగా వాళ్ళ సాను భూతి సహకారాలు సంపాదించవలసినదిగా ఆదేశించాడు. ఎవళ్ళెవళ్ళు ఏం చెయ్యాలో వాళ్ళకే తెలుసన్నాడు. సోల్‌మన్ సమాధిమీద వుంచడానికి ఒక పెద్ద పూల మాలకు చందాలకోసమే ఈ ప్రయత్నమని వివరించాడు అధికారి కోల్. అంచేత, సైమన్‌షెనెల్లర్, మొట్టమొదటిసారి, అన్ని ఆఫీసుల్లోకి వెళ్ళి, ఒకరి తరువాత ఒకర్ని అందరు ఉద్యోగస్థుల్ని దర్శించాడు. ఆ ఉద్యోగులందరి ముఖాలూ, పేర్లూ, హోదాలూ, అతని కదివరకే చాలకాలంగా తెలుసు. అతనా జాపితాను, టైప్‌రైటర్ల దగ్గర కూర్చున్న ఆడవాళ్ళ వద్దకూ, కాగితాలతో బరువెక్కిన బల్లల దగ్గర కూర్చున్న మగవాళ్ళ దగ్గరకూ కూడా తీసికెళ్ళాడు. ఈ చందా లెందుకో కాగితం మీద పైన వ్రాసివున్నా, మళ్ళీ వివరించాడు. పేరుకి ఎదురుగా వెయ్యబడ్డ చందా, నిర్దిష్టమైన ఆచారాన్ని అనుసరించి, అణాపైసలతో వసూలు చేశాడు. చందాలు, ముప్పై ఫెన్నింగులు మొదలుకొని, ఒక మార్కువరకూ పడ్డాయి. మొత్తం ముప్పై ఎనిమిది మార్కులు వసూలయాయి. గౌరవోద్యోగి కోల్‌కి ఆశ్చర్యం వేసింది. జాపితా చూసిన తరువాత, ఈ పెద్దమనిషి, చనిపోయిన ఉద్యోగికి సంబంధించిన శాఖలోనేగాక ఇతర శాఖల్లోకూడా వసూలు చేశాడని అర్థమైంది. అంతేగాక, శాఖలోని ఉద్యోగులకంటే, కీర్తిశేషుడైన సోల్‌మన్‌ని ఎరగని ఇతరశాఖల వాళ్ళే ఎక్కువ చందాలిచ్చారన్న సంగతికూడా అతను గుర్తించి ముఖం చిట్లించుకున్నాడు. ఈ సంఘటన వసంతకాలంలో జరిగింది. కాస్త వాతావరణం అప్పుడే వెచ్చబడుతోంది.

వేసవికాలమంతా, సైమన్ ,తన కవసరమైన వెచ్చదనాన్ని, ఆఫీసులూ, కాగితాలసంచులతో నిమిత్తంలేకండా, ఎక్కడ దొరికితే అక్కడ సంపాదించు కున్నాడు. ఎండలో కాగిన వీథుల్లో, పార్కు బల్లలమీద, నదిగట్టుని. అడపా తడపా చిన్నచిన్న పనులుచేసి ఆర్జించిన కొద్దిమొత్తాలతో అవసరాలు గడుపు కున్నాడు. అయితే, దరఖాస్తులూ, నవరణ పత్రాలూ అధికారులకు సమర్పించ డానికి కాలవ్యవధి, చలికాలంలోకంటే వేసవిలో తగ్గినట్టయితే ఇబ్బందివస్తుంది. అంచేత, సైమన్‌షెనెల్లర్, నిర్జీవమైన ఆఫీసుల్లో గడిపే కాలానికి, భగవంతు డిచ్చిన ఎండలో విశ్రాంతిగా గడిపే కాలానికి జతచేర్చి, వ్యవధి ఏమాత్రం మారకండా జాగ్రత్తపడ్డాడు. క్రిందటి చలికాలంలో ఆఖరు ఘట్టాన్ని గురించి ఆ వేసవి

కాలం అంతా సుదీర్ఘంగా ఆలోచించాడు సైమన్. ఆ సుదీర్ఘమైన తర్జనభర్జన ఫలితంగా, వేసవి గడిచి ఎట్టకేలకు అక్టోబరు నెల ప్రవేశించగానే, పగలంతా ఆరుబయట గడపడానికి బదులు సచివాలయంలోని వేడిగాలిగొట్టాలు వృధాపోకండా అనుభవించడం మంచిదని తోచగానే, ఒకనాడు సైమన్, తన సంచీ నింపుకుని అక్కడికి బయలుదేరాడు. అయితే యీసారి సంచీని, వెనకటిలాగ పాత వార్తా పత్రికలు, అనవసరమైన బిల్లులతో నింపలేదు. వాటిబదులు రూళ్ళువేసిన తెల్లకాగితాలతో నింపాడు. గౌరవోద్యోగి కోల్, పూలమాల కోసం చందాలకోసం తనను పంపినది మొదలు, ఎండాకాలం అంతా అతి స్పష్టంగా ఆలోచించుకుని తయారు చేసిన ఒక ప్రణాళికకు అవసరమైన ముఖ్యసాధనం ఆ రూళ్ళకాగితాలు.

జరుగబోయే ప్రచ్ఛన్న యుద్ధంలో ప్రతికక్షులంతా,— అంటే ఒక మహా సేనావారమంత సంఖ్యాబలం గల సచివాలయం ఒకవంక, పనీపాటాలేకండా, సోమరిగా ఆ భవనపు వరండాలలో కాలక్షేపం చేస్తుంటే సైమన్ షెనెల్లర్ మరొక వంక—ఒకరికొకరు కొంత అలవాటుపడ్డ తరువాత; ఆరుబయట అంతకంతకు చలి ఎక్కువౌతూ, సచివాలయపు వరండాలు రోజురోజుకీ వెచ్చబడ్డం స్థిరపడ్డాక, తన సంచీలోనుంచి ఒక రూళ్ళ కాగితం తీసి సైమన్ ఒక అభ్యర్థన వ్రాశాడు— సాటి స్త్రీ పురుషోద్యోగు లందరికీ ఒక విజ్ఞప్తి అది. సహోద్యోగి అయిన ఎమెరమ్ నోల్, తమతో పనిచేసే ఎమెరమ్ నోల్, ఇన్స్పెక్టర్ నోల్, (ఈ వ్యక్తిని సైమన్ స్వయంగా సృష్టించాడు) తన ఏభై రెండవ యేట అకాలమరణానికి గురియైన సందర్భంలో, అతని సమాధిమీద ఉంచడానికి ఒక పెద్ద పూలచెండు కొనడానికి, సాటి ఉద్యోగులంతా స్నేహపూర్వక విరాళాలు ఇయ్యవలసినదిగా ఆ విజ్ఞప్తి సారాంశం. సైమన్ విరాళాల జాపితా తీసుకువెళ్ళినప్పుడు, కొందరు ఉద్యోగులు, ఈ నోల్— ఇన్స్పెక్టర్ నోల్— ఏ నోల్ అని అడిగారు. అయితే సైమన్, ఇతడు అవతల ప్రక్కశాఖలో పనిచేస్తున్న ఇన్స్పెక్టర్ నోల్ అనీ, చాలా సాధువూ, స్నేహపాత్రుడూ అయిన కుంటి నోల్ అని వివరించిన మీదట, ఆ నోల్ ఎవరో అందరికీ అర్థమైపోయింది. అతని అకాలమరణానికి అందరూ విచారించారు. సైమన్ షెనెల్లర్ వివరించిన గుణగణాలే గాక, చనిపోయిన నోల్‌లో మరికొన్ని కొత్త సుగుణాలు కూడా గుర్తించి, ఉద్యోగులంతా అతన్ని అత్యంత ఆప్తుణ్ణిగా అంగీకరించారు.

56 చందాదారుల వల్ల, దగ్గర దగ్గర నలభై మార్కుల వరకూ సొమ్ము వసూలుచేసిన తరువాత, సైమన్, మొదటి జాబితా మూలకుబెట్టి, మరో కొత్త జాబితా తయారుచేశాడు. ఎందుకంటే, ఎంత ఖరీదైన పూలచెండుకైనా, ఇంత మంది విరాళాలిచ్చాక తను ఇవ్వడం అనవసరమని ఏ ఉద్యోగి అయినా అనొచ్చు. అయితే, సచివాలయంలో దాతృత్వ ప్రవృత్తి చల్లబడకూడదు. ఈ రెండవ జాబితాతో పని పూర్తయాక, కీర్తిశేషుడైన ఎమ్మెరమ్ నోల్ మూడవ జాబితా మీదికి ఎక్కాడు. ఈ విధంగా తొమ్మిది రోజులు కృషిచేసి, సచివాలయం అంతా తిరిగి, సుఖంగా ఒక నెలరోజులు గడిచిపోడానికి గ్రాసం సంపాదించుకున్నాడు. తన అణకువ, స్నేహపూర్వకమైన నడవడివల్ల, మంత్రి, కార్యదర్శి, మొదలుకుని, చిన్నజీతం పుచ్చుకునే టైపిస్టువరకూ అందరూ విరాళాలిచ్చారు. అవును మరి, సైమన్ షెనెల్లర్‌ని అందరూ ఎరుగుదురు. అతన్ని ప్రతిఒక్కరూ, ఎన్నో సార్లు సచివాలయంలో ఎక్కడో ఒకచోట చూశారు. సైమన్‌షెనెల్లర్ అంత పరిచితుడు కావడంవల్ల, అతను విరాళాలు అర్థించిన వారందరూ, చనిపోయిన ఎమ్మెరమ్ నోల్‌ని కూడా బాగా ఎరుగుదుమనే అనుకున్నారు. మిగతావారికి మార్గదర్శకుడు కావడం, అతని ధర్మం గనక, మంత్రిగారు, ఐదుమార్కుల నాణెం ధారాళంగా ఇచ్చారు.

వసూలైన మొత్తం పూర్తిగా అయిపోకండానే, సైమన్, ఇంకో కొత్త రకం విరాళాలకోసం బయలుదేరాడు. ఈసారి సందర్భం ఏమిటంటే, ఇరవై ఎనిమిదేళ్ళ హాన్స్‌క్రీబెల్—సచివాలయంలో ఒక పరిశోధకుడు – ఆడ గుమస్తా ఐరీన్ ఓర్లిన్‌ని వివాహమాడుతున్నాడు. వధూ వరు లిద్దరూ సచివాలయంలో ఉద్యోగులు. వారి ఆశయం ఏమిటంటే, (కొంత స్వార్థంతో కూడుకున్నదే ననుకోండి) ఒక కొత్తరకం పోమ్ రబ్బరుపరుపు, కొంచెం ఖరీదైనదే, వివాహ బహుమానంగా సంపాదించాలని. సాటి ఉద్యోగులు సహకరిస్తే నిజానికి వారి ఆశయం నెరవేరడం కష్టంకాదు. విరాళాలతోబాటు, ప్రతిఒక్కరి శుభాకాంక్షలూ, కాబోయే వధూవరులకు అందజెయ్యడానికి కూడా పూనుకున్నాడు సైమన్. అవన్నీ తనకే అందజేసుకున్నాడు; అసలు సృష్టిలోనే లేని ఆ వధూవరులకు, విరాళాలూ, శుభాకాంక్షలూ అనవసరంగనక. ఆ తరువాత నెల, ఒక అద్భుతమైన పోమ్ రబ్బరు పరుపు తనకుతాను ఏర్పరచుకున్నాడు. ఆ పై నెల దాబెయ్య

డానికి, తాత్కాలికోద్యోగి, టోబిస్ లింక్ నొకణ్ని సృష్టించుకున్నాడు. పాపం, ఈ టోబిస్‌లింక్ ఉన్న సంతాన సంపద చాలక, ఇప్పుడు పదవబిడ్డకి తండ్రి అయాడు. తాత్కాలికోద్యోగికి, సైమన్ వాదం ప్రకారం, బిడ్డల కిచ్చే ప్రభుత్వ సహకార వేతనానికి అర్హత లేదు. అయితే, ఈ తాత్కాలికోద్యోగి టోబిస్ లింక్ నిజానికి తన పదవబిడ్డకుగాను ప్రభుత్వం దగ్గరనుంచి ధనసహాయం పొందాడన్న ఆరోపణ వచ్చింది. అందరిలోకీ, మహాచెడ్డ నోరు గల ఉద్యోగి ఒకడు, ఫలానా టోబిస్ లింక్‌కి సంతాన సహకార నిధినించి ఎంత ధన సహాయం లభించిందో మహా ఆక్కసుతో లెక్కలువేసి, దుష్ప్రచారానికి దిగడంతోటే, శ్రీ షెనెల్లర్, తను పడుతున్న ఈ శ్రమ అంతా తన స్వలాభం కోసం కాదనీ, తన సంతానానికి సహాయపడమని మిత్రు లెవరినీ అతను అర్థించడం లేదనీ అతి స్పష్టంగా సూచించ వలసి వచ్చింది. టోబిస్ లింక్ యొక్క పదవ బిడ్డ ప్రణాళిక ఎంత విజయవంత మైందంటే, శ్రీ సైమన్ షెనెల్లర్ ఆనందాతిశయం పట్టలేక, ఆ బిడ్డను తన సొంత బిడ్డలాగ ప్రేమించడం మొదలుపెట్టాడు.

అయితే అన్నిటికన్నా అధిక విజయం సాధించినది. సైమన్‌షెనెల్లర్, కార్యదర్శి ఎల్‌ఫ్రీడ్ రాస్‌మస్ సహాయార్థం ఆరంభించిన ప్రణాళిక. సైమన్ షెనెల్లర్ కల్పించిన ఈ రాస్‌మస్, పాపం అతిచిన్నవాడు, అందగాడు. అకస్మాత్తుగా ట్రామ్ క్రిందపడి రెండు కాళ్లూ పోగొట్టుకున్నాడు. ఈ విరాళాలు వసూలు చేశాక, పరిశుద్ధమైన సైమన్ అంతరాత్మ కొంత పీకడం ప్రారంభించింది. సాటి వారి జాలిగుండెలు కరిగించడానికి, విషాదగాధలల్లి సంపాదించిన సొమ్మును అతను హాయిగా అనుభవించలేకపోయాడు. మాసానికి పది పన్నెండు రోజు లీ విధంగా చందాలు వసూలుచెయ్యడం, మానెయ్యడానికి వీల్లేని అలవాటుగా పరిణమించాక, సైమన్ షెనెల్లర్‌లో ఒక మార్పొచ్చింది. తనకు అర్థంకాని మధన, తనమీద తనకే ఒక అసంతృప్తి, విరాళాలమెడల సిగ్గుతో కూడిన ఏహ్యాభావం, చిరకాలంగా అలవాటైపోయినందువల్ల అది తప్పనిసరిగా చెయ్యవలసిన ఒక విధ్యుక్తధర్మంగా పరిణమించడం, అన్నీ అతని అంతరాత్మని పీడించడం మొదలు పెట్టాయి. అయితే ఈ మధన అంతా మెడ గుండెదాకా లేచేసరికి, వీటిని తిరిగి అతను దిగమింగేసేవాడు. అంతరాత్మ బరువు మొయ్యడం అతని స్వభావానికి విరుద్ధం.

సైమన్ షెనెల్లర్ తాత్కాలికోద్యోగి అయినా కాడు. పలచని మనిషి, సాధారణమైన పొడుగు. తెలివితేటల్లో కోడిపెట్టలాంటివాడు. కాని సచివాలయ శాఖల్లో అతను ఒక మరిచిపోడానికి వీల్లేని భావంగా అయిపోయాడు. ప్రతి నిత్యం చందాలకోసం తిరగడం వల్లనేకాదు, అది చాలామందికి విసుగుకలిగించిందికూడా. అయితే చలనంలేకుండా గడ్డకట్టుకుపోయిన ఆ ఆఫీసు వాతావరణంలోకి మానవుల కష్టనిష్టురాలను అతిమెల్లగా ప్రవేశపెట్టాడు. అవన్నీ కల్పితాలైనా, మానవత్వం దృష్ట్యా వాస్తవమైనవి. పెళ్ళిళ్ళు, చావులు, బిడ్డలు, ప్రతినిత్యం మనిషి అనుభవించే బాధలు, మొదట కొంచెం చిరాకు పుట్టించినా, దాతృత్వానికి పునాదివేసేవి. సైమన్ షెనెల్లర్, గౌరవోద్యోగి కాదు, అధమం తాత్కాలికోద్యోగి అయినా కాదు. వరండాల్లోతిరిగే వట్టి సోమరి. అతని హయాంలో ముగ్గురు మంత్రులు పదవీ విరమణం చేశారు, ముగ్గురూ అతన్ని ముఖతః ఎరుగుదురు. వరండాల్లో అతను ఎదురుపడితే, ఆప్యాయంగా చిరునవ్వుతో — ఒకొక్కప్పుడు హృదయ పూర్వకంగా నవ్వేవారు కూడా — అతన్ని పలుకరించేవారు. కుశలప్రశ్నకూడా చేసేవారు.

నాలుగవ మంత్రి హయాంలో, చలికాలపు ఆఖరు దినాలలో ఒకనాడు, వేడిగాలి గొట్టాన్ని ఆనుకుని, అలిసిపోయిన అతని మెదడు మరొక విషాదగాథను చందాలకోసం రూపొందిస్తుండగా, సైమన్ షెనెల్లర్, పక్షవాతం వచ్చి కుప్పగా కూలిపోయాడు. అతని చంకలోని కాగితాలసంచీ కిందపడిపోయింది. విథివిరామం లేకండా కృషిచేసిచేసి, వయస్సు నిండకండానే కార్యరంగంనించి నిష్క్రమించిన ఇతరుల విషయంలో, ప్రాపంచిక పరిభాషలో, దీన్ని గుండెజబ్బు అంటారు. మరొకచోటు లేనికారణంగా తాత్కాలికంగా ఖాళీగావున్న ఒక కార్యదర్శి గదిలోబల్ల మీద అతన్ని పడుకోబెట్టారు. కార్యదర్శి వచ్చాక, ఈవ్యక్తికోసం ప్రభుత్వకార్యాలు ఆగడానికి వీల్లేదు గనక, గృహనిర్మాణశాఖకు అతన్ని మార్చారు. మూడురోజు లైనా, ఈ వ్యక్తి పేరూ, ఊరూ, చిరునామా ఎవ్వరికీ తెలియని కారణంగా, ఒక శాఖనించి మరొకశాఖకు అతన్ని బదిలీ చేశారు. నాలుగవనాడు, సచివాలయానికీ తనకీ గల సంబంధమేమిటో, తను అసలు ఎవరో వివరించకండానే, సైమన్ షెనెల్లర్ దేహయాత్ర చాలించాడు. అతన్ని ఎవ్వరూ వ్యక్తిగతంగా ఎరగరు. అతనితో ఎవరికీ అంత చనువులేదు. అతని పేరూ, ఉద్యోగం ఎవరికీ తెలియవు.

విరాళాల జాపితాలతో వచ్చి, ప్రతివ్యక్తికీ కష్టకాలం ఎప్పుడో రాక తప్పదని, అందరికీ గుర్తుచేస్తుండేవా డంతే. అతని అంత్యక్రియలకు విరాళాల జాపితా అన్ని శాఖలూ తిరిగి వచ్చేసరికి, కార్యదర్శి ఎల్‌ఫ్రెడ్ రాస్‌మన్‌కి పడ్డ చందాలకన్నా ఎన్నోరెట్లు వసూలైంది. అతి గంభీరంగా జరిగింది అతని సమాధి. ఆ సమాధి మీద ఉంచిన పూలచెండ్లతో – ఇతరుల పూలచెండ్లకోసం అతను పడ్డ శ్రమకు ప్రతిఫలం అతనికి పూర్తిగాముట్టింది. విరాళాలలోనుంచి సమాధికి ఖర్చుకాగా చాలా సొమ్ము మిగిలిపోయింది. అయితే చనిపోయిన వ్యక్తి దృష్ట్యా, ఆ ధనాని కేమీ ప్రయోజనం లేదు. ఇంక జాలికీ, పరిష్కారం కాని మానవ సమస్యలకూ కూడా ప్రయోజనం లేదు.